



# విభారె

## తెలుగు దినపత్రిక

## VIBHARE TELUGU DAILY





PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర్ రెడ్డి గురువారం 28-03-2024 సంపుటి : 06 సంచిక : 198 పేజీలు : 8 వెల : రూ 3-00

# ఇడుపులపాయలో వైఎస్ సమాధివద్ద నివాళి



**ఎన్నికల ప్రచార బస్సుకు ప్రారంభం**
**తల్లి విజయమ్మ ఆశీస్సులు తీసుకున్న జగన్**







అమరావతి,మార్చి27(: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఎన్నికల ప్రచార బస్సు యాత్రను ప్రారంభించారు. కడప జిల్లా ఇడుపులపాయలోని తండ్రి వైఎస్సార్ సమాధివద్ద నివాళి అర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా తల్లి విజయమ్మ ఆశీస్సులు తీసుకున్నారు. 21 రోజుల పాటు రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాలల్తో మేమంతా సిద్ధం పేరుతో బస్సుయాత్ర, బహిరంగ సభలు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే పార్టీ శ్రేణులను సన్నద్ధం చేసిన జగన్ రాష్ట్రంలోని 175 అసెంబ్లీ, 25 లోక్‌సభ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించి పార్టీ శ్రేణుల్లో జోష్‌ను నింపారు. బస్సు యాత్ర వేంపల్లి ,వీరపునాయునిపల్లి, ఉరుటూరు, యర్రగుంట, సున్నపురాళ్ల పల్లి మీదుగా నిర్వహించి ప్రొద్దుటూరులో సాయంత్రం నిర్వహించే బహిరంగ సభలో ఆయన ప్రసంగించనున్నారు. అక్కడి నుంచి దువ్వూరు, చాగలమర్రి క్రాసింగ్ మీదుగా ఆళ్లగడ్డకు చేరుకుని అక్కడే రాత్రి బస చేస్తారని పార్టీ శ్రేణులు వెల్లడించారు. మేమంతా సిద్ధం పేరుతో జగన్ బస్సు యాత్రను ప్రారంభించారు. ఇడుపులపాయ నుంచి బస్సు యాత్ర ప్రారంభమైంది. గత ఎన్నికల కు ముందు ప్రతిపక్ష నేతగా అనేక హామీలను సీఎం జగన్ ఇచ్చారు. వాటిని నెరవేర్చకపోతే ఈ ఎన్నికల్లో ఓటడగనని అప్పుడే చెప్పారు. సంపూర్ణ మద్యపాన నిషేదం చేయకున్నా ఓటడగబోనని తెలిపారు. సీపీఎస్ ను వారంరోజుల్లో రద్దు చేసి ఓపీఎస్ ను పునరుద్ధరిస్తానని చెప్పి.. జీపీఎస్ ను తెచ్చి ఉద్యోగులను త్రిశంకు స్వర్గంలో జగన్ ఉంచారు. వైసీపీకి 25కు 25 ఎంపి సీట్లు ఇస్తే ప్రత్యేక హోదా సాధించి తీరుతాం అన్నారు. రాజ్య సభ సీట్లు కలుపుకుంటే అంతకు మించి ఇచ్చినా హోదా ఊసే లేదు. అధికారంలోకి వచ్చాక హోదా విషయంలో వినతి పత్రాలకు మాత్రమే జగన్ పరిమితమయ్యారు మినహా కేంద్రం మెడలు వంచిందీ లేదు.. హోదా అడిగిందీ లేదు.కాళ్లు, గెడ్డాలు పట్టుకోని హోదా కోసం బతిమాలగలం... తప్ప కేంద్రాన్ని ఎదిరించలేం అంటూ జగన్ చేతులెత్తేశారు. ప్రత్యేక హోదా సాధన కోసం అప్పట్లో టీడీపీ ఎంపీలు రాజీనామా చేయాలని పదే పదే ప్రశ్నలు అడిగారు. ఇప్పుడు హోదా అంశంపై జనానికి జగన్ ఏం చెపుతారంటూ విపక్షాలు ప్రశ్నిస్తున్నాయి. నేటికీ విశాఖ రైల్వే జోన్‌పై జగన్ నోరు మెదపిన పాపాన పోవడం లేదు. పోనీ అధికారంలోకి వచ్చాక ధరలను అలాగే ఉంచారా? అంటే అదీ లేదు. నిత్యావసరాల నుంచి విద్యుత్ చార్జీలు, బస్సు టికెట్ రేట్లను అనేక సార్లు ఇబ్బడి ముబ్బడిగా పెంచేశారు. పెరుగుతున్న నిత్యవసరాల ధరలను స్థిరీకరిస్తామని ఆఖరుకు జగన్ చేతులెత్తేశారు. పైగా మద్యపాన నిషేధం విధిస్తామని చెప్పారు. అది జరగకపోగా.. జే బ్రాండ్‌ల పేరిట సొంతంగా మద్యాన్ని తయారు చేసి మరీ జనాన్ని మత్తులో ముంచేశారు.

# ఆ '3వేల కోట్లను ప్రజలకే అందిస్తాం'..

## బీజేపీ అభ్యర్థికి ప్రధాని హామీ



న్యూఢిల్లీ : ప్రధాని నరేంద్ర మోదీ లోక్‌సభ బీజేపీ అభ్యర్థికి కీలక హామీ ఇచ్చారు. పశ్చిమ బెంగాల్‌లో అవినీతి పరులు దోచుకున్న పేద ప్రజల సొమ్మును ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అటాచ్ చేసిందని, తిరిగి ఆ సొమ?మును వారికే చెందేలా కృషి చేస్తున్నట్లు ప్రధాని మోదీ తెలిపారు.లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ప్రధాని మోదీ పశ్చిమ బెంగాల్‌లోని ఆయా లోక్‌సభ స్థానాల బీజేపీ అభ్యర్థులకు స్వయంగా ఫోన్ చేసి మాట్లాడుతున్నారు. ఎన్నికల ప్రచారంపై ఆరా తీస్తున్నారు. మంగళవారం సందేశ్‌ఖాలీ బాధితురాలు, బసిర్‌హట్ లోక్‌సభ బీజేపీ అభ్యర్థి రేఖ పత్రతో మాట్లాడిన మోదీ.. ఇవాళ పశ్చిమ బెంగాల్ కృష్ణానగర్ లోక్‌సభ అభ్యర్థి, తృణముల్ కాంగ్రెస్ మహిళా నేత మహువా మొయిత్రాపై పోటీ చేస్తున్న బీజేపీ అభ్యర్థి రాజమాత అమ్రితా రాయ్‌తో మాట్లాడారు. ఈ సందర్భంగా పేదల ప్రజల సొమ్మును అవినీతిపరులు దోచుకున్నారని ప్రధాని అన్నారు. వారి నుంచి ఈడీ జప్తు చేసిన ఆస్తులు, డబ్బులు తిరిగి వారికే చెందేలా చట్టపరమైన అవకాశాలను అన్వేషిస్తున్నట్లు అమృతా రాయ్‌తో ప్రధాని మోదీ చెప్పారంటూ బీజేపీ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అంతే కాదు, ఈడీ అటాచ్ చేసిన సొమ్ము విషయంలో తన స్టాండ్ ఏంటో పశ్చిమ బెంగాల్ ప్రజలకు అమ్రితా రాయ్ చెప్పాలని ప్రధాని మోదీ కోరారు. త్వరలో అందుకు తగ్గట్లుగానే చట్టాపరమైన మార్గాల ద్వారా పేద ప్రజలకు సొమ్ము చేరవేస్తామని మోదీ.. అమ్రితా రాయ్‌కు చెప్పినట్లు సమాచారం.పార్టీ విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు అమ్రితా రాయ్‌తో మాట్లాడే సమయంలో ప్రధాని మోదీ ప్రస్తావన తెచ్చిన ఆ రూ. 3 వేల కోట్లు.. పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో పలువురు ఉద్యోగాల కోసం లంచంగా చెల్లించిన మొత్తం సొమ్మేనని, ఆ సొమ్మును ఈడీ అటాచ్ చేసింది. తిరిగి ఎవరైతే జాబ్ కోసం డబ్బులు చెల్లించారో వారికే ఆ సొమ్ము అందించనున్నట్లు కమలం నేతలు చెబుతున్నారు.

# జగన్ క్యాంప్ కార్యాలయం వద్ద కంటైనర్

## లోకేశ్ ఆరోపణలపై మండిపడ్డ వైవి సుబ్బారెడ్డి

అమరావతి,మార్చి27: విజయవాడలోని ఏపీ సీఎం వైఎస్ జగన్ రెడ్డి క్యాంపు కార్యాలయంలోకి కంటైనర్ రాకపై వైసీపీ నాయకుడు వైవీ సుబ్బారెడ్డి క్లారిటీ ఇచ్చారు. ఈ విషయాలపై టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేస్తున్న ఆరోపణలను ఖండించారు. మంగళవారం ఓ కంటైనర్ సీఎం క్యాంపు కార్యాలయానికి వచ్చింది. కంటైనర్‌లో ఏముందంటూ నారా లోకేష్ పలు అనుమానాలు వ్యక్తం చేశారు. ఓటర్లకు పంపిణీ చేసేందుకే డబ్బులను తరలిస్తున్నారని ఆరోపించారు.కంటైనర్‌లో వచ్చింది బ్రెజిల్ సరుకా? మద్యంలో మెక్కిన వేలకోట్లా, లండన్ పరారీకి ఏర్పాట్లా ? ఏపీ సెక్రటేరియట్ దాచిన దొంగ ఫైళ్లా? అంటూ చేసిన ఆరోపణలపై వైవీ స్పందించారు. చిన్న విషయాన్ని రాద్ధాంతం చేస్తున్నారని, టీడీపీ నాయకులకు ఏ కంటైనర్ చూసినా డ్రగ్స్ కంటైనరే గుర్తొస్తుందని విమర్శించారు. విశాఖ నదీతీరంలో పట్టుబడ్డ డ్రగ్స్ కేసులో టీడీపీ నేతల బంధువులే ఉన్నారని పేర్కొన్నారు. క్యాంపు కార్యాలయంలో ఉండే ప్రభుత్వ శాఖలకు అవసరమైన ఫర్నిచర్‌ను తీసుకెళ్లారని వెల్లడించారు. లోకేష్ చట్ట సభలకు ఎన్నికైన వ్యక్తి కాదని దొడ్డిదారిన మంత్రి అయి అవగాహన లేక ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు.



# యువత కోసం 20లక్షల ఉద్యోగాలు



**అధికారంలోకి రాగానే పెద్ద ఎత్తున ఉద్యోగ నియామకాలు**
**ఎన్నికలు రావడంతో తాడేపల్లి దాటి వస్తున్న ముసుగు వీరుడు**
**అన్ని రాష్ట్రాల సిఎంల ఆస్తి..ఒక్క జగన్ వద్దే ఉంది**
**రాష్ట్రాన్ని కాపాడుకునేందుకే ఎన్నికల పొత్తులు**
**జబర్దస్త్ ఎమ్మెల్యే రోజా చేసిందేమీ లేదు**
**పుత్తూరు, నగరి ప్రజాగళం సభల్లో చంద్రబాబు విమర్శలు**





చిత్తూరు,మార్చి27: యువత కోసం 20లక్షల ఉద్యోగాలు ఎదురు చూస్తున్నాయని తెదేపా అధినేత చంద్రబాబు అన్నారు. అధికారంలోకి రాగానే పెద్ద ఎత్తున ఉద్యోగ నియామకాలు చేపడతామని ప్రకటించారు.ప్రజాగళం ప్రచార కార్యక్రమంలో భాగంగా పుత్తూరు బహిరంగ సభలో పాల్గొన్న మాజీ సీఎం, టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడిపై వైసీపీ సర్కారుపై నిప్పులు చెరిగారు. ఎన్నికలు వస్తుండడంతో ముసుగు వీరుడు జగన్ మోహన్ రెడ్డి మొట్టమొదటిసారి తాడేపల్లి దాటి వస్తున్నాడని వ్యంగ్యాస్త్రాలు సంధించారు. దేశంలో ఉన్న అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రుల వద్ద ఆస్తి.. ఒక్క జగన్మోహన్ రెడ్డి దగ్గరే ఉందని మండిపడ్డారు. ఈయన తాను పేదవాడు అని చెప్పుకోవడం సిగ్గుచేటని మండిపడ్డారు.చిత్తూరు జిల్లా పుత్తూరులో నిర్వహించిన ప్రజాగళం ప్రచారసభలో ఆయన ప్రసంగించారు. అధికారంలోకి వచ్చాక .. 60 రోజుల్లో మెగా డీఎస్సీ పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.'చదువుకున్న యువతకు ఒక్క ఉద్యోగమైనా వచ్చిందా? యువతకు ఉద్యోగాలు రావాలంటే ఎన్డీయేకు ఓటు వేయాలి. ఉన్నది లేనట్టు.. లేనిది ఉన్నట్టు చెప్పే వ్యక్తి జగన్. ఆయనో అబద్దాల కోరు. బోగస్ సర్వేలు చేయిస్తారు. రాజకీయాలకు పనికిరాడు. పేదల మనిషి ఎవరో.. పెత్తందారు ఎవరో ప్రజలు తెలుసుకోవాలని అన్నారు. మేం ప్రారంభిం చామనే అన్న క్యాంటీన్లు రద్దు చేశారు. అధికారంలోకి వచ్చాక రాష్ట్ర వ్యాప్తంగా అన్న క్యాంటీన్లు తీసుకొస్తాం. టిడ్కో ఇళ్లు ఇవ్వకుండా పేదలను ఇబ్బంది పెట్టారు. రాష్ట్రాన్ని కాపాడుకునేందుకే పొత్తు పెట్టుకున్నాం. కేంద్రంలో మళ్లీ భాజపానే అధికారంలోకి వస్తుంది. ఐదేళ్ల ప్రజల ఆవేదన.. వచ్చే ఎన్నికల్లో అగ్నిగా మారాలని అన్నారు. ఈ ఎన్నికల్లో జగన్‌ను ఓడించేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని అన్నారు. మేం ఉన్నప్పుడు **(మిగతా 7లో )**

# ప్రొద్దుటూరులో సీఎం జగన్ మేమంతా సిద్ధం సభ..

వైఎస్సార్, ఎన్నికల ప్రచారంలో భాగంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మేమంతా సిద్ధం బస్సు యాత్ర మొదలుపెట్టారు. కాసేపట్లో ప్రొద్దుటూర్ టౌన్‌లో జరగబోయే బహిరంగ సభలో సీఎం జగన్ పాల్గొని ప్రసంగించనున్నారు.తొలిరోజు వైస్సార్ జిల్లా కడప పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో యాత్ర కొనసాగించింది. ఇడుపులపాయలో వైఎస్సార్ ఘాట్ వద్ద మహానేతకు నివాళులర్పించి, ప్రత్యేక ప్రార్థనలు అభిమానుల కోలాహలం నడుమ మొదలైన యాత్ర.. సాయంత్రం వీరపనాయనిపల్లి మండలంలో ముగిసింది.ఇదిలా ఉంటే.. దారి పొడవునా గ్రామాల్లో జనం జననేతకు నీరాజనం పట్టారు. మధ్య మధ్యలో సీఎం జగన్ వాహనం పైకి ఎక్కడి అభివాదం చేశారు. అంతేకాదు.. ప్రజలు సమర్పించిన విజ్ఞప్తి పత్రాలను సైతం స్వీకరించారాయన.

# భారత్‌లోని నిరుద్యోగుల్లో 83 శాతం మంది యువతే: అంతర్జాతీయ కార్మిక సంస్థ

న్యూఢిల్లీ: భారత్‌లోని నిరుద్యోగుల్లో 83 శాతం మంది యువతేనని ఇంటర్నేషనల్ లేబర్ ఆర్గనైజేషన్ పేర్కొంది. 2022లో భారత్‌లోని మొత్తం నిరుద్యోగ జనాభాలో యువత 83 శాతం మంది ఉన్నారని తెలిపింది. ఐఎల్‌వో, ఇన్‌స్టిట్యూట్ ఫర్ హ్యూమన్ డెవలప్‌మెంట్ సంయుక్తంగా రూపొందించిన 'ఇండియా ఎంప్లాయ్‌మెంట్ రిపోర్ట్ 2024'ను చీఫ్ ఎకనామిక్ అడ్వైజర్ (సీఈఏ) వీ అనంత నాగేశ్వరన్ మంగళవారం విడుదల చేశారుకాగా, నిరుద్యోగుల్లో విద్యావంతులైన యువకులు 2000లో 54.2 శాతం మంది ఉండగా, 2022లో ఇది 65.7 శాతానికి పెరిగినట్లు ఈ నివేదిక పేర్కొంది. అలాగే చదువుకున్న నిరుద్యోగుల్లో పురుషుల (62.2 శాతం) కంటే స్త్రీలు (76.7 శాతం) ఎక్కువగా ఉన్నారని తెలిపింది. భారత్‌లోని పట్టణ ప్రాంత యువ విద్యావంతులలో నిరుద్యోగ సమస్య ఎక్కువగా కేంద్రీకృతమైందని ఈ రిపోర్ట్ పేర్కొంది. 2000 నుంచి 2019 వరకు యువకుల ఉపాధి, ఉపాధి పెరుగుదల తక్కువగా కనిపించిందని పరిశోధకులు గుర్తించారు.



# అంతర్జాతీయ లింకులపై సీబీఐ ఆరా..

## బ్రెజిల్‌కు స్పెషల్ టీంలు

విశాఖపట్నం: విశాఖ డ్రగ్స్ కేసులో సీబీఐ దర్యాప్తు వేగవంతం చేసింది. డ్రగ్ డీల్ వెనుక అంతర్జాతీయ లింకులపై ఆరా తీస్తోంది. ప్రత్యేక విచారణ బృందాలు బ్రెజిల్ వెళ్లనున్నాయి.డ్రగ్ డీల్ వెనుక అంతర్జాతీయ లింకులు ఛేదించే దిశగా సీబీఐ దర్యాప్తు చేస్తోంది. డ్రై ఈస్ట్ సప్లయ్ చేసిన ఐసీసీ బ్రెజిల్ సంస్థలో కీలక ఆధారాలు లభిస్తాయని సీబీఐ అంచనా వేస్తోంది. ఇప్పటికే సంధ్య ఆక్వా ప్రతినిధుల కాల్ డేటా, ఈ మెయిల్స్, వాట్స్ అప్ చాటింగ్స్ ద్వారా కొంత మేర సమాచారం లభించిందినార్కోటిక్స్ పరీక్షల నివేదికల కోసం దర్యాప్తు బృందం ఎదురు చూస్తోంది. సంచలనం రేకెత్తించిన కేసులో డ్రగ్స్ నిర్ధారణ కోసం వివిధ ల్యాబ్‌ల్లో పరీక్షలు నిర్వహించారు. ఇప్పటికే మెటీరియల్, డాక్యుమెంటరీ ఆధారాలను సీబీఐ సేకరించింది. సంధ్య ఆక్వా ప్రతినిధుల కదలికలపై పూర్తి స్థాయిలో నిఘా పెట్టింది.కాగా, తమ సంస్థ తీసుకొచ్చిన డ్రైఈస్ట్‌లో డ్రగ్స్ ఎలా వచ్చాయో తమకు తెలియదని సంధ్యా ఆక్వా సంస్థ చెబుతోంది.

# సంపాదకీయం

గురువారం 28-03-2024

## మోడీ ధృతరాష్ట్ర కౌగిలి రాజకీయాలు !

ఎన్నికల సమయంలో ప్రతిపక్ష నేతలను అరెస్టు చేయడం వల్ల ప్రయోజనం ఉంటుందా అన్న అనుమా నాలు చాలామందికి ఉన్నాయి. ఎందుకంటే ఎపిలో, తెలంగాణలో ఏదో కేసుల్లో అందరినీ ఇరికించి ఏడ్పించినవారే. రేవంత్ రెడ్డిని కేసులో ఇరికించిన కెసిఆర్‌కు భంగపాటు తప్పలేదు. అలాగే జగన్ కూడా టిడిపి వారిని అరెస్ట్ చేయడమే లక్ష్యంగా ప్రభుత్వాన్ని నడిపారు. ఈ క్రమంలో రాజకీయాలను పరిశీలిస్తే కక్షసాధింపు రాజకీయాలను ప్రజలు సహించరని గుర్తించాలి. అక్రమాలు లేదా అన్యాయాలు జరిగితే అన్ని కేసులను ఒకే తరహాలో చూసి, వాటిపై చర్య తీసుకోవాలి. కేజ్రీవాల్ అరెస్ట, కవితల అరెస్ట్ మోడీ ప్రభుత్వానికి సాధారణంగానే కనిపించవచ్చు. కానీ ఇంతకన్నా ఘోరంగా ఉన్నాయనుకుంటున్న కేసుల్లో ఇడి రంగంలోకి దిగడం లేదు. ఎపిలో జగన్, తెలంగాణలో కెసిఆర్, అంతకుముందు చంద్రబాబుల అవినీతి విషయంలో పెద్దగా దర్యాప్తు సాగలేదు. అందుకే ప్రజలకు కేంద్రం దర్యాప్తులపై అనుమానాలు ఉన్నాయి.తెలంగాణలో మోదీ పర్యటించిన రోజే కేసీఆర్ కుమార్తె కవితను ఢిల్లీ మద్యం కేసులో అరెస్టు చేశారు. సరిగ్గా వారం రోజులకు ప్రధాని భూటాన్‌లో ఉన్నప్పుడు ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను అరెస్టు చేశారు. కవిత అరెస్టుతో కేసీఆర్ ఆత్మరక్షణలో పడిపోయారు. ఇది కెసిఆర్ ఊహించివుండడు. ఇక కేజ్రీవాల్ అరెస్టు వల్ల వచ్చే రాజకీయ పర్యవసానాలను ఎదుర్కోవడానికి కూడా బిజెపి సిద్ధమై ఉండే వుంటుంది. అందుకే ఈ ఇద్దరి అరెస్ట్‌ను ప్రజలు పెద్దగా స్పందించడం లేదు. ఎందుకంటే ఇంతకన్నా ఎక్కువగా అక్రమాలు, అన్యాయాలు చేసిన వారిని వదిలి పిచ్చుకలపై పడ్డారన్న భావన ప్రజల్లో ఇప్పుడిప్పుడే చర్చ సాగుతోంది. అందువల్ల అవినీతికి సంబంధించిన ఎలాంటి కేసులైనా వదలకుండా ముందుకు సాగితేనే బిజెపి నిజాయితీ గురించి సానుకూలంగా స్పందిస్తారు. ఈసారి ఢిల్లీ ఎన్నికలు ఆరవ దశలో మే 25న నిర్ణయించారు. అంటే కేజ్రీవాల్ అరెస్టు జరిగిన రెండు నెలలకు ఢిల్లీలో ఎన్నికలు జరుగబోతున్నాయన్నమాట. ఢిల్లీలో పరిస్థితులను తనకు అనుకూలంగా మార్చుకోవడానికి ఈ మాత్రం సమయం చాలునని నరేంద్రమోదీ అంచనావేసుకుని ఉంటారని అనిపిస్తోంది. ఢిల్లీలో గత ఎన్నికల్లో ఏడుకు ఏడుసీట్లు గెలిచిన బీజేపీ ఈసారి ఆమ్ ఆద్మీ పార్టీ, కాంగ్రెస్ చేతులు కలపడంతో కొంత ఎదురు గాలి తప్పదని భావించి ఉంటుంది. కేజ్రీవాల్‌ను అరెస్టుచేయడం ద్వారా ఆప్‌ను పూర్తిగా అణచివేయాలన్న లక్ష్యం మోడీలో కనిపిస్తోంది. అంతెందుకు మోడీ తన హయాంలో ప్రాంతీయ పార్టీలను దగ్గరకు తీసుకోవడం, వాటిని తుదముట్టించడం అన్న యత్నాలు సాగుతున్నాయి. ఈ క్రమంలో మోడీ వల్ల ప్రజలకు అంతా మంచే జరిగితే ప్రజలు వీటిని పెద్దగా పట్టించుకోరు. అలాకాకుండా తన రాజకీయ ఎదుగుదలకు అడ్డంగా ఉన్న పార్టీలను మట్టుబెట్టి, ప్రజలను కూడా ధరలు ఇతరత్రా జిఎస్టీ లాంటి పన్నులుతో దెబ్బ తీయాలని చూస్తే ప్రజలకు కూడా ఎక్కడో ఒకచోట గట్టిగా దెబ్బకొడతారని బిజెపి గుర్తిస్తే మంచిది. అందుకే కేజ్రీవాల్ అరెస్ట్ తరవాత పరిశీలిస్తే ఢిల్లీ ఎన్నికల షెడ్యూలే కాదు, ఇతర రాష్ట్రాల్లోఎన్నికల తేదీలు కూడా బీజేపీ వ్యూహరచనకు అనుగుణంగా ఉన్నాయని గమనించవచ్చు. బీజేపీ పెద్దగా ప్రభావం చూపలేని తమిళనాడు, కేరళ ఎన్నికలు మొదటి రెండు దశల్లోనే ఎన్నికలను నిర్వహిస్తున్నారు. బీజేపీ తనకు అనుకూలంగా ఉన్న రాష్ట్రాల్లో ఎన్నికలను వివిధ దశల్లో చివరి వరకూ నిర్వహిస్తున్నారు. కాంగ్రెస్‌కూ, బీజేపీకీ మధ్య ముఖాముఖి పోటీ జరిగితే బీజేపీదే పై చేయి అవుతుందని మోదీ భావనగా కనిపిస్తోంది. అందుకే ప్రాంతీయ పార్టీలను దెబ్బతీస్తే కాంగ్రెస్ చచ్చిన పాము కనక దాని సంగతి తరవాత చూసుకో వచ్చన్న భావన ఉన్నట్లుగా కనిపిస్తోంది. తెలంగాణలో కొత్తగా అధికారంలోకి వచ్చిన రేవంత్ ప్రభుత్వాన్ని, గత బిఆర్ఎస్ ప్రభుత్వాన్ని ఒకే గాటన కట్టి విమర్శలు చేయడం వల్ల కూడా బిజెపికి పెద్దగాలాభం ఉండదు. ఇక్కడ కవితను అరెస్ట్ చేయడం వల్ల బిఆర్ఎస్÷–ను దెబ్బతీయడం జరగవచ్చు. కానీ అప్పుడే రేవంత్‌పై నిందలు వేస్తే మాత్రం ప్రజల్లో వ్యతిరేకత వస్తుందని బిజెపి గుర్తిస్తే మంచిది. తెలంగాణలో ఇటీవలే అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ దూకుడును తట్టుకొని బీజేపీ ప్రభంజనం సృష్టించడం కూడా అంత సులువు కాదు. 17 సీట్లు గెలుస్తామని చెప్పడం అతిశయోక్తి కాక తప్పదు. మోదీ ఎంత బలవంతుడైనా స్థానిక నేతలు బలంగా లేకపోతే విజయం సాధించడం కష్టం. స్థానిక నాయకత్వం బలంగా లేకపోవడం కారణంగా తెలంగాణలో కనీసం 17మంది గట్టి నాయకులను తయారు చేసుకోలేక పోయారు. ఇతర పార్టీ నేతల్ని, వ్యాపారస్తుల్ని లాగి వారికి అప్పటికప్పుడే సీట్లు ఇవ్వడం చూస్తే దీనిని అర్థం చేసుకోవచ్చు. ఇక ఆంధ్రప్రదేశ్‌లోనూ బిజెపికి సొంతంగా బలం లేదు. అక్కడ పొత్తులో భాగంగా టిడిపి, జనసేన ఊపులో ఒకటి రెండు సీట్లు గెలిస్తే ఎక్కువే. ఆరు సీట్లకు పోటీ చేస్తున్న బీజేపీని తెలుగుదేశం గెలిపిస్తే తప్ప గట్టెక్కలేరు. కేరళలో కేంద్ర మంత్రులతో పోటీ చేయించినా ఖాతా తెరుస్తుందా అన్నది అనుమానమే. కర్ణాటకలో కూడా బీజేపీ గత ఎన్నికల్లో 28కి 26 సీట్లు గెలిచినా ఈసారి అన్నిసీట్లు గెలవడం సాధ్యపడదని ప్రచారం సాగుతోంది. అధికారం పోవడంతో మళ్లీ యడ్యూరప్పకు ప్రాధాన్యత పెంచారు. అలాగే గాలి జనార్దన్ రెడ్డి స్థాపించిన 'కల్యాణ రాజ్య ప్రగతి పక్ష' పార్టీ వల్ల బీజేపీకి వచ్చిన నష్టాన్ని దృష్టిలో ఉంచుకుని ఆయనను బీజేపీలో చేర్చుకోవల్సివచ్చింది. కాంగ్రెస్ బ్యాంకు ఖాతాలను స్తంభింపచేయడం, ప్రతిపక్ష పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులను, పార్టీ నేతలను అరెస్టు చేయడం, ప్రత్యర్థులపై ఏజెన్సీలను ప్రయోగించడం వంటి చర్యల ద్వారా తమ పార్టీ బలం పెంచుకోగలమని బీజేపీ నేతలు అనుకుంటే అది పొరపాటు కాగలదు. అక్రమార్కులను నిజంగానే లోపల వేస్తున్నదని గట్టిగా నమ్మిక వస్తే తప్ప బిజెపివన్నీ రాజకీయ ఎత్తుగడలుగానే ప్రజలు భావిస్తారు.

## టీకాంగ్రెస్ అభ్యర్థుల లిస్ట్.. మూడు స్థానాలపై సస్పెన్స్!

ఢిల్లీ: తెలంగాణలో మిగిలి ఉన్న ఎనిమది లోక్‌సభ స్థానాలకు కాంగ్రెస్ అధిష్టానం బుధవారం అభ్యర్థుల్ని ఖరారు చేయనుంది. ఇందుకోసం ఆ పార్టీ కేంద్ర ఎన్నికల కమిటీ (సీఈసీ) మరోమారు భేటీ కానుంది.ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అధ్యక్షతన పార్టీ ప్రధాన కార్యాలయంలో జరిగే ఈ సమావేశంలో పార్టీ మాజీ చీఫ్‌లు సోనియాగాంధీ, రాహుల్‌తో పాటు కమిటీ సభ్యులు కేసీ వేణుగోపాల్, అంబికాసోనీ, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, అలాగే సీఎం రేవంత్‌రెడ్డి,



ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, సీఈసీ సభ్యులు ఉత్తమ్ కుమార్ రెడ్డిలు పాల్గొననున్నారు.ఇక, ఎనిమిది స్థానాల్లో అభ్యర్థుల ఎంపికకు సంబంధించి ఇప్పటికే రాష్ట్ర, జిల్లా నేతలు, పార్లమెంట్ పరిధిలోని ఎమ్మెల్యేల అభి ప్రాయాలను ఏఐసీసీ స్వీకరించింది. వారిచ్చిన సూచనలు, సలహాల మేరకు ఆశావహుల అభ్యర్థి త్వాలను పరిశీలించి తుది జాబితాను సీఈసీకి పంపింది. ప్రజల్లో బలం, కుల సమీకరణలు, పార్టీకి చేసిన సేవల ఆధారంగా అభ్యర్థుల పేర్లను నేతలు సిఫారసు చేశారు. కాగా సీఈసీ వివిధ సర్వేల నివేదికలు, పార్టీ విధేయత ఆధారంగా అభ్యర్థులపై ఇప్పటికే ఓ అభిప్రాయానికి వచ్చినట్లు తెలుస్తోంది. కాగా, ఇప్పటికే రెండు దఫాల్లో ఏఐసీసీ తొమ్మిది అభ్యర్థులను ప్రకటించిన విషయం తెలిసిందే.మరోవైపు.. ఈ ఎనిమిదింటిలో మూడు పార్లమెంట్ స్థానాలపై ఉత్కంఠ నెలకొంది. ఖమ్మం, భువనగిరి, నిజామాబాద్ స్థానాలపై కాంగ్రెస్ నేతలు కుస్తీ పడుతున్నట్టు తెలుస్తోంది. ఖమ్మం నుండి పొంగులేటి ప్రసాద్ రెడ్డి, మల్లు నందిని, యుగెంధర్, రాజేంద్ర ప్రసాద్ టికెట్ ఆశిస్తున్నారు. ఇక, భువనగిరి నుండి టికెట్ కోసం చామల కిరణ్, కంచర్ల చంద్రశేఖర్ రెడ్డి, గుత్తా అమిత్, కోమటి రెడ్డి ఫ్యామిలీ ప్రయత్నాలు చేస్తోంది. లేనిపక్షంలో బీసీ అభ్యర్థికి ఈ స్థానం కేటాయించే అవకాశం ఉన్నట్టు పార్టీలో చర్చ జరుగుతోంది. భువనగిరి లోక్‌సభ స్థానానికి ఓయూ విద్యార్థి నేత కైలాష్ అప్లికేషన్ పెట్టుకున్నారు.ముఖ్యంగా కరీంనగర్ పార్లమెంట్ స్థానానికి తొలి నుంచి మాజీ ఎమ్మెల్యే ఎ.ప్రవీణ్‌రెడ్డి పేరు పరిశీలనలో ఉన్నప్ప టికీ, అక్కడే బీజేపీ నుంచి బండి సంజయ్, బీఆర్ఎస్ నుంచి వినోద్‌కుమార్ పోటీలో ఉన్న నేపథ్యంలో అక్కడ మరో అభ్యర్థిని పరిశీలించాలని ఏఐసీసీ సూచించినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో తీన్మార్ మల్లన్న పేరును తెరపైకి తెచ్చి నట్లు సమాచారం.నిజామబాద్ టికెట్ బరిలో జీవన్ రెడ్డి, సునీల్ రెడ్డి, అనిత రెడ్డి మధ్య తీవ్ర పోటీ నెలకొంది. మరోవైపు.. హైదరాబాద్ పార్లమెంట్ స్థానాన్ని మస్కత్ ఆశిస్తున్నారు. వరంగల్ స్థానంపై దమ్మోటి సాంబయ్య ఆశలు పెట్టుకున్నారు. మెదక్ రేసులో నీలం మధు ఉన్నారు. ఆదిలాబాద్ సీటు కోసం ఆదివాసీ, లంబాడ నాయకుల మధ్య గట్టి పోటీ నెలకొంది. ఈ నేపథ్యంలో ఎవరికి టికెట్ వస్తుందోనన్న సస్పెన్స్ కొనసాగుతోంది.

## అభ్యర్థిని మార్చాలని అధిష్టానంపై ఒత్తిడి.. ఎన్నికల బరి నుంచి సైదిరెడ్డి డ్రాప్ అవుతారా..?

హైదరాబాద్ : ఎంపీ అభ్యర్థి విషయంలో నల్లగొండ బీజేపీలో ముసలం మొదలైందా..? ఎంపీ అభ్యర్థి సైదిరెడ్డిని మార్చాలని పార్టీ అధిష్టానంపై నేతలు ఒత్తిడి చేస్తున్నారా..?అభ్యర్థిని మార్చకపోతే పార్టీ శ్రేణులు సహాయ నిరాకరణ చేస్తామంటున్నాయా..? ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే అదే అనిపిస్తోంది. ఏకంగా ఎన్నికల బరి నుంచి సైదిరెడ్డి డ్రాప్ అవుతారన్నట్లు ప్రచారం జరుగుతోంది. అంతేకాదు రేపటి పార్లమెంటు స్థాయి సమావేశానికి నేతలు డుమ్మా కొట్టాలని ఫ్లాన్ చేస్తున్నారట. మరోవైపు పార్టీ బలోపేతానికి సైదిరెడ్డి అవసరమేనని క్యాడర్ ను అగ్ర నేతలు బుజ్జగిస్తున్నారు. అసలు నల్లగొండ పార్లమెంటు బీజేపీలో ఏం జరుగుతోంది..?లోక్‌సభ ఎన్నికల్లో హ్యాట్రిక్ సర్కార్ లక్ష్యంగా భారతీయ జనతా పార్టీ దూకుడు పెంచింది. తెలంగాణలో అత్యధిక స్థానాలపై కన్నేసిన కషాయ దళం.. ఇందుకు అనుగుణంగా పావులు కదుపుతోంది. ఈ క్రమలోనే ఇతర పార్టీల నేతలను సైతం కమలం గూటి చేర్చుకుని టికెట్లను ఇచ్చింది. గెలుపే లక్ష్యంగా బీజేపీ నల్లగొండ లోక్‌సభ టికెట్ ను పార్టీ నేతలను కాదని, పది రోజుల క్రితం కాషాయ కండువా కప్పుకున్న బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే సైదిరెడ్డికి ప్రకటించింది.ఇపుడు నల్లగొండ బీజేపీ ఎంపీ అభ్యర్థి సైదిరెడ్డిపై బీజేపీ పాత క్యాడర్, నేతలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారట. దీంతో బీజేపీ నల్లగొండ ఎంపీ సీటు విషయంలో ఆ పార్టీలో ముసలం మొదలైందట. సైదిరెడ్డి అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకిస్తున్న



నల్లగొండ, సూర్యాపేట జిల్లాలకు చెందిన బీజేపీ ముఖ్య నేతలు, అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు.. తాజాగా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్ రెడ్డిని హైదరాబాద్ లో కలిశారట. ఎంపీ అభ్యర్థిగా సైదిరెడ్డిని మార్చాలని విజ్ఞప్తి చేశారట. బీజేపీ కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించి, రాళ్ల దాడులు చేయించిన వారికి ఎలా ఇస్తారని కూడా ప్రశ్నిస్తున్నారట.సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలం గుర్రంబోడులో గిరిజనుల భూములను బీఆర్ఎస్ నేతలు ఆక్రమణలకు పాల్పడ్డారనే ఆరోపణలు వచ్చాయి. ఈ భూములను రక్షించేందుకు 'గిరిజన భరోసా యాత్ర' పేరుతో బీజేపీ అప్పటి రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ 2021 ఫిబ్రవరిలో గుర్రంబొడులో పర్యటించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్, బీజేపీ కార్యకర్తల మధ్య జరిగిన ఘర్షణ రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. అక్రమ కేసులతో కొందరు బిజెపి నేతలు జైలుకు కూడా వెళ్లి వచ్చారు. ఆ వివాదానికి కారణమని భావిస్తున్న సైదిరెడ్డికి ఎంపి టికెట్ ఇవ్వడాన్ని నల్గొండ పార్లమెంటు సెగ్మెంట్ లోని కొందరు బీజేపీ నేతలు జీర్ణించుకోలేక పోతున్నారట.ఈ నేపథ్యంలో నల్లగొండ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డిని మార్చాలని పార్టీ నాయకులు అధిష్ఠానంపై ఒత్తిడి తెస్తున్నారట. అభ్యర్థి ఎంపిక విషయంలో పార్టీ ఒక నిర్ణయం తీసుకున్న తరువాత వెనక్కి తగ్గేది ఉండదని అగ్రనేతలు సైదిరెడ్డి వ్యతిరేక వర్గానికి స్పష్టం చేశారట. అయితే పార్టీ ప్రకటించిన అభ్యర్థి తనకు తాను డ్రాప్ అయితే పార్టీ మరో ఆలోచన చేసే అవకాశం ఉంటుందని చెప్పారట. దీంతో సైదిరెడ్డిని మార్చకపోతే ఎన్నికల్లో సహాయ నిరాకరణకు దిగాలని ఆయనను వ్యతిరేకిస్తున్న కీలక నేతలు నిర్ణయించారట.

## ఈడీ కస్టడీలో క్షీణించిన కేజ్రీవాల్ ఆరోగ్యం.. ఆప్ ఆందోళన..!

మద్యం కుంభకోణం కేసులో ఆప్ కన్వీనర్, ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ ప్రస్తుతం ఈడీ కస్టడీలో ఉన్న విషయం తెలిసిందే. అయితే, ఈడీ కస్టడీలో ఉన్న కేజ్రీవాల్ ఆరోగ్యంపై ఆమ్ ఆద్మీ పార్టీ ఆందోళన వ్యక్తం చేసింది. ఈడీ కస్టడీలో ఆప్ సుప్రిమో ఆరోగ్యం క్షీణించిందని ఆ పార్టీ బుధవారం తెలిపింది.మధుమేహంతో



బాధపడుతున్న కేజ్రీ రక్తంలో చక్కెర స్థాయిలు హెచ్చుతగ్గులకు లోనవుతున్నట్లు పేర్కొంది. ఆయన బ్లడ్ షుగర్ లెవల్స్ ఒకానొక సమయంలో 46 ఎంజీకి పడిపోయినట్లు తెలిపింది. షుగర్ లెవల్స్ ఈ స్థాయికి పడిపోవడం చాలా ప్రమాదకరమని వైద్యులు చెప్పినట్లు ఆప్ వర్గాలు బుధవారం వెల్లడించాయి. ఈ మేరకు తమ సుప్రిమో ఆరోగ్యం పరిస్థితిపై ఆందోళన వ్యక్తం చేశాయి.మరోవైపు ఈడీ కస్టడీలో ఉన్న కేజ్రీవాల్‌ను కేంద్ర దర్యాప్తు సంస్థ కస్టడీకి కోరే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఢిల్లీ మద్యం పాలసీ కేసులో ఢిల్లీ సీఎం, ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు ఈనెల 21న అదుపులోకి తీసుకున్న విషయం తెలిసిందే. అరెస్ట్ అనంతరం ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టులో ప్రవేశపెట్టగా.. ఏడు రోజుల పాటు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కస్టడీకి అప్పగించింది. విచారణ నిమిత్తం కేజ్రీవాల్‌ను పదిరోజుల పాటు కస్టడీకి ఇవ్వాలన్న ఈడీ విజ్ఞాపనను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం ఈనెల 28వరకూ మాత్రమే కస్టడీకి అనుమతించింది. అయితే, కోర్టు విధించిన కేజ్రీ కస్టడీ రేపటితో ముగియనుంది. ఈ నేపథ్యంలో ఈడీ కస్టడీ ముగిసిన తర్వాత కేజ్రీవాల్‌ను తమ కస్టడీకి ఇవ్వాలని సీబీఐ కోర్టును కోరే అవకాశం ఉందని సదరు వర్గాలు వెల్లడించాయి.

## కుల మత రాజకీయ పార్టీలు లేని నాయకుడిగా అందరికి మేలు చేస్తున్న జగనన్న

---వైసీపీ ఎమ్మెల్యే శిల్పారవి రెడ్డి



----విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి మార్చి 27–వైఎస్సార్సీపీ ప్రభుత్వం జగన్ మోహన్ రెడ్డి కుల మత రాజకీయ పార్టీలు భేదాలు లేని నాయకుడిగా అందరికి మేలు చేస్తున్న జననేత జగన్న చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై వైఎస్సార్సీపీ లోకి రావడం సంతోషంగా ఉందన్నారు. బుధవారం ఎమ్మెల్యే శిల్పారవిరెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్ బాష సమక్షంలో నబి రసూల్, కలాం భాష, మహబూబ్ బాష, గ్రైనేట్ మాలి, ఇర్షాద్ అధ్వర్యంలో నంద్యాల పట్టణం ముస్లిం మైనార్టీకి చెందిన బిస్మిల్లా ఫ్రై ఉడ్ మరియు టింబర్ డిపో సుబాన్, కుటుంబ సభ్యులు, మౌలానా, నిజాముద్దీన్ మరియు కుటుంబ సభ్యులు, సోదరులు చేరడం జరిగింది. వీరందరికి ఎమ్మెల్యే పార్టీ కండువాలు కప్పి సాదర స్వాగతం పలికారు. పార్టీ భలోపేతానికి విజయానికి కృషిచేయాలని కోరారు..

## సౌజన్య ఫంక్షన్ హాలులో ఘనంగా పుట్టిన రోజు వేడుకలు



--విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి మార్చి 27–. నంద్యాల పట్టణంలో ప్రముఖ కూరగాయల వ్యాపారి మార్కెట్ ప్రసాద్ గారి ముద్దుల మనవడు వేదాంత్ పుట్టిన రోజు వేడుకలు బుధవారం సౌజన్య ఫంక్షన్ హాలులో ఘనంగా నిర్వహించారు. వేడుకలకు నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి. మహానంది దేవస్థానం ఈవో కాపు చంద్రశేఖర్ రెడ్డి. కౌన్సిలర్లు. స్థానిక నాయకులు. విలేఖరులు తదితరులు పాల్గొన్నారు. అలాగే శ్రీ మహానందీశ్వర స్వామి దేవస్థానం వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య వేద ఆశీర్వచనం ఘనంగా జరిగింది.

## మరోసారి 'మహువా మొయిత్రా' కు ఈడీ నోటీసులు





పశ్చిమ బెంగాల్ కృష్ణానగర్ లోక్‌సభ అభ్యర్థి, తృణముల్ కాంగ్రెస్ మహిళా నేత మహువా మొయిత్రాకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు మరోసారి సమన్లు జారీ చేసినట్లు తెలుస్తోంది.ఇప్పటికే రెండుసార్లు సమన్లు పంపిన ఈడీ.. తాజాగా మరోసారి పంపింది. విదేశీ మారకపు చట్టాల ఉల్లంఘన ఆరోపణలపై ఆమెను ఈడీ ప్రశ్నించనున్నట్లు సమాచారం.మహువా మొయిత్రాను ఈడీ అధికారులు నాన్ రెసిడెన్షియల్ ఎక్స్‌ట్రనల్ (ఎన్ఆర్ఈ), అకౌంట్స్, ఒక దేశం నుంచి మరో దేశానికి చెందిన అకౌంట్లకు నగదు చెల్లింపులు, ఇతర లావాదేవీల గురించి ప్రశ్నించనున్నారు.గత ఏడాది మహువా మొయిత్రా స్నేహితుడు, న్యాయవాది జై అనంత్ దెహాద్రాయ్ ఆమెపై ఆరోపణలు చేశారు. వ్యాపారవేత్త హీరానందానీకి మహువా తన పార్లమెంట్ పాస్‌వర్డ్‌ను ఇచ్చారని అనంత్ ఆరోపించారు. దీనివల్ల హీరానందానీ అవసరమైనప్పుడు నేరుగా పార్లమెంట్‌లో తనకు కావాల్సిన ప్రశ్నలు అడిగే అవకాశం ఉంటుందని అనంత్ అన్నారు.అంతేకాకుండా, డబ్బులు తీసుకొని హీరానందానీ గ్రూప్ తరఫున పార్లమెంట్‌లో మహువా ప్రశ్నలు అడిగారని కూడా ఆయన ఆరోపణలు చేశారు. ఆ ఆరోపణలతో వివాదం మొదలైంది. ఈ ఆరోపణలు వెల్లువెత్తిన నేపథ్యంలో మహువా మొయిత్రాపై సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ అధికారులు కేసు నమోదు చేశారు. అనంతరం ఆమె ఇంటిలో సోదాలు నిర్వహించారు. కొద్ది రోజులకే ఆమె పార్లమెంట్ నుంచి బహిష్కరణకు గురయ్యారు.తాజాగా, పార్లమెంట్‌లో ప్రభుత్వాన్ని విమర్శించేలా ప్రశ్నలను అడిగేందుకు వ్యాపారవేత్త దర్శన్ హీరానందానీ నుండి మహువా మొయిత్రా రూ.2 కోట్ల నగదు, అలాగే లగ్జరీ ఐటమ్స్ తీసుకున్నారని, ప్రతిఫలంగా ఆమె తన పార్లమెంటు వెబ్‌సైట్ లాగిన్ వివరాలను దర్శన్ హీరానందానీకి షేర్ చేశారని, ఇదే అంశంపై ఈడీ హీరానందనీని సైతం విచారణ కోసం పిలిపించినట్లు జాతీయ మీడియా కథనాలు చెబుతున్నాయి.కాగా, క్యాష్ ఫర్ క్వైరీ ఆరోపణల్ని మొయిత్రా ఖండించారు

# వీళ్లంతా ఎవర్రాబాబు...

## కమలం కేడర్ లో అంతర్మథనం

విజయవాడ, మార్చి 27 ఆంధ్రప్రదేశ్ లో బీజేపీకి నోటా కంటే ఓట్ల శాతం తక్కువ అని అంటారు. కమలం పార్టీ నేతలు ఆ మాటంటే కోప్పడతారు కానీ అభ్యర్థుల ఎంపిక చూస్తే తెలియడం లేదూ అని ప్రశ్నలు పార్టీ అగ్రనాయకత్వానికి సూటిగా తాకుతున్నాయి. ఆ పార్టీ ఆరు పార్లమెంటు స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. అయితే ఒక్కరూ బీజేపీ సిద్ధాంతాలను అలవర్చుకున్న వారు కాదు. పోనీ దశాబ్దాల తరబడి పార్టీలో పనిచేసిన వారు కాదు. అందులో నరసాపురం అభ్యర్థి శ్రీనివాస వర్మను మినహాయిస్తూ మిగిలిన ఐదుగురు పార్టీలు మారి వచ్చిన వాళ్లే. సహజంగా ఆర్ఎస్ఎస్ లేదా.. బీజేపీ అనుబంధ సంస్థల నుంచి వచ్చిన వారికి పార్టీ అధిక ప్రాధాన్యత ఇస్తుంది. అయితే ఏపీలో మాత్రం అందుకు విరుద్ధంగా అభ్యర్థుల ఎంపిక జరిగింది. అరకు నుంచి కొత్తపల్లి గీత, రాజమండ్రి నుంచి పురంద్రీశ్వరి, అనకాపల్లి నుంచి సీఎం రమేష్, తిరుపతి నుంచి వరప్రసాదరావు, రాజంపేట నుంచి కిరణ్ కుమార్ రెడ్డి ఈ ఐదుగురిలో ఏ ఒక్కరికీ బీజేపీ బ్యాక్ గ్రౌండ్ లేదు. బ్యాక్ గ్రౌండ్ చూస్తే మాత్రం వీరికి మరో రాష్ట్రంలో అయితే సీటు దక్కేది కాదు. కేవలం ఏపీలో మాత్రమే సీట్లు దక్కాయన్న కామెంట్స్ వినపడుతున్నాయి. ఏపీలో బీజేపీ బలహీనం అనడానికి ఇంతకంటే ఉదాహరణ ఏమి కావాలంటూ ప్రత్యర్థి పార్టీలు ప్రశ్నిస్తున్నాయి. తమకు సరైన నేత లేకపోయినా కేంద్రంలో అధికారంలో ఉండటంతో బీరాలు పోవడం తప్ప బీజేపీకి ఏపీలో అంత సీన్ లేదని అనుకోవచ్చన్న అభిప్రాయం అభ్యర్థుల ఎంపిక చూస్తేనే అర్థవుతుందంటున్నారు. అరకు నుంచి బరిలోకి దిగుతున్న కొత్తపల్లి గీత గతలో వైసీపీ నుంచి ఎంపీగా గెలిచారు. ఆ తర్వాత టీడీపీలోకి మారారు. ఆ తర్వాత బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. అరకు పార్లమెంటు స్థానంలో ఇప్పటి వరకూ బీజేపీ గెలిచిన దాఖలాలు లేవు. అక్కడ కాంగ్రెస్, వైసీపీలు మాత్రమే గెలుస్తూ వస్తున్నాయి. అలాంటి సీటులో పార్టీ మారి వచ్చిన గీతను ఎంపిక చేశారంటున్నారు. పురంద్రీశ్వరి ఇప్పుడయితే పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు కానీ.. ఆమె కాంగ్రెస్ హయాంలో కేంద్ర మంత్రిగా పనిచేశారు. కాంగ్రెస్ నుంచి బీజేపీలో చేరి ఎన్టీఆర్ కుమార్తెగా ఆమెకు ఆ ప్రాధాన్యత దక్కిందనుకోవచ్చు. రాజమండ్రిలో బీజేపీ అభ్యర్థి ఎంపిక కొంత వరకూ సరైనదేనని చెప్పాలి. రాజమండ్రి పార్లమెంటు స్థానంలో బీజేపీ, టీడీపీ ఎక్కువ సార్లు గెలవడం కూడా ఆమె ఎంపిక ప్రాధాన్యతను చెబుతుంది. సామాజికవర్గం పరంగా కూడా అక్కడ ఆమె ఎంపిక సరైనదేనని అంటున్నారు. రాజంపేట నుంచి బరిలో ఉన్న నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ చివరి ముఖ్యమంత్రి. 2014లో ఆయన జై సమైక్యాంధ్ర పార్టీ పెట్టారు. తర్వాత సుదీర్ఘకాలం రాజకీయాలకు దూరంగా ఉన్నారు. తర్వాత కాంగ్రెస్ లో చేరారు. అక్కడ ఇమడ లేకపోయారు. దీంతో చివరకు ఆయన బీజేపీని ఎంచుకుని రాజంపేట అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. సీఎం రమేష్ అనకాపల్లి అభ్యర్థిగా పోటీచేస్తున్నారు. ఆయన టీడీపీ నుంచి బీజేపీలో చేరారు. బీజేపీలో రోజే ఆయన టిక్కెట్ దక్కించుకున్నారు. పార్టీలో చేరిన రోజే ఆయనకు టిక్కెట్ కన్ఫర్మ్ అయింది. ప్రజారాజ్యం, వైసీపీ, జనసేన ఇప్పుడు బీజేపీ.. పార్టీలు ఏదైనా టిక్కెట్ మాత్రం నాదేనంటూ ఆయన జనం ముందుకు వస్తున్నారు. ఒక్క నరసాపురం అభ్యర్థి శ్రీనివాసవర్మ మాత్రమే ఇందుకు మినహాయింపు. ఆయన బీజేపీ మునిస్పల్ కౌన్సిలర్ స్థాయి నుంచి ఎంపీ అభ్యర్థి టిక్కెట్ దక్కించుకున్నారు. ముప్పయి ఏళ్లుగా బీజేపీలో వివిధ పదవుల్లో ఉన్నారు.

# పురుహూతికా ఆశీస్సుల తర్వాత ప్రచారం

కాకినాడ, మార్చి 27 ఎన్నికల ప్రచారానికి పవన్ సిద్ధమయ్యారు. పొత్తులతో పాటు సీట్ల కేటాయింపు తుది దశకు చేరుకోవడంతో ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టాలని పవన్ నిర్ణయించారు. తాను పోటీ చేయబోయే పిఠాపురం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించనున్నారు. ఈనెల 30 తేదీని ముహూర్తంగా ఫిక్స్ చేశారు. అక్కడి నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికల ప్రచారం ప్రారంభిస్తారని జనసేన వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటికే జనసేన 18 అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించిన సంగతి తెలిసిందే. టిడిపి తో పాటు బిజెపి అభ్యర్థుల ఎంపిక సైతం దాదాపు తుది దశకు చేరుకుంది. దీంతో ప్రచారం ముమ్మరం చేయాలని మూడు పార్టీలు నిర్ణయించాయి.ముందుగా అష్టాదశ మహా శక్తి పీఠాల్లో ఒక శక్తిపీఠమైన శ్రీ పురుహూతీక అమ్మవారిని పవన్ దర్శించుకున్నారు. అక్కడ వారాహి వాహనానికి పూజలు చేసిన అనంతరం దత్త పీఠాన్ని సందర్శిస్తారు. మూడు రోజుల పాటు పిఠాపురం నియోజకవర్గంలోనే పవన్ ఉండనున్నారు. పార్టీ శ్రేణులతో వరుసగా సమావేశం కానున్నారు. మండలాల వారీగా క్రియాశీలక నాయకులతో సమావేశాలు ఏర్పాటు చేసి.. దిశా నిర్దేశం చేయనున్నారు. టిడిపి, బిజెపి నాయకులతో భేటీ కానున్నారు. ఇకనుంచి ఇతర ప్రాంతాల్లో పర్యటనలకు వెళ్లాలన్నా.. పిఠాపురం నుంచి వెళ్లనున్నట్లు తెలుస్తోంది. ఉగాది వేడుకలను సైతం పవన్ పిఠాపురంలో జరుపుకోనున్నారు.అటు రాష్ట్ర వ్యాప్త పర్యటనలు మూడు విడతల్లో చేపట్టాలని పవన్ నిర్ణయించారు. జనసేన పోటీ చేయబోయే అన్ని నియోజకవర్గాల్లో పవన్ పర్యటన ఉంటుంది. అందుకు తగ్గట్టు షెడ్యూల్ ను పార్టీ వర్గాలు సిద్ధం చేస్తున్నాయి. మధ్యలో భాగస్వామ్య పక్షాల నేతలతో కలిసి ప్రచార వేదికలను పంచుకోనున్నారు. చంద్రబాబు, పురందేశ్వరి, బిజెపి అగ్ర నేతలు కలిసి ఎన్నికల ప్రచార సభల్లో పాల్గొనన్నారు. జనసేన పోటీ చేయబోయే కాకినాడ, మచిలీపట్నం పార్లమెంట్ స్థానాల పరిధిలో కూడా పవన్ ప్రచార సభలు ఎక్కువగా ఉండేలా జనసేన నేతలు ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. మరోవైపు ఎన్నికల ప్రచార శైలిపై పార్టీ కేంద్ర కార్యాలయంలో పవన్ నేతలతో సమీక్షించారు. మూడు పార్టీల శ్రేణులు సమన్వయంతో ముందుకు సాగడానికి అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు.పిఠాపురంలో పవన్ ను ఓడించాలని వైసీపీ పక్కా ప్లాన్ తో ఉంది. ఇప్పటికే అక్కడ తెలుగుదేశం తో పాటు జనసేన నాయకులను ఆకర్షించే పనిలో పడింది. వందల కోట్ల రూపాయలు కుమ్మరిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో జనసేన నాయకులు ఒకరకంగా ఆందోళన చెందుతున్నారు. గత అనుభవాల దృష్ట్యా పవన్ కళ్యాణ్ కూడా అలెర్ట్ అయ్యారు. ఎన్నికల వరకు పిఠాపురం లోనే ఉండడానికి డిసైడ్ అయ్యారు. పిఠాపురం నుంచి రాష్ట్రవ్యాప్త కార్యకలాపాలకు పవన్ శ్రీకారం చుట్టనున్నారు. జనసేన కార్యకలాపాలన్నీ అక్కడి నుంచే జరపడానికి పార్టీ వర్గాలు నిర్ణయం తీసుకున్నాయి.

# బెజవాడలో అన్నదమ్ముల సవాల్



విజయవాడ, మార్చి 27 సొంత సోదరులే? రాజకీయ ప్రత్యర్థులుగా మారిపోయారు. ఆ గట్టు? ఈ గట్టు అంటూ ఏదీ లేదు? ఎవరి గట్స్ ఏంటో జనం మధ్యే తేల్చుకుంటామంటూ ఎన్నికల యుద్ధానికి కాలు దువ్వుతున్నారు. ఇప్పటికే ఇద్దరి అభ్యర్థిత్వాలను ఖరారు చేశాయి ఆయా పార్టీలు? సిట్టింగ్ ఎంపీ కేశినేని శ్రీనివాస్ అలియాస్ నాని ఈసారి వైసీపీ అభ్యర్థిగా బెజవాడ యుద్ధానికి సిద్ధమవగా, ఆయనకు సవాల్ విసురుతున్నారు నాని సొంత సోదరుడు కేశినేని శివనాథ్ అలియాస్ చిన్ని? ఈ ఇద్దరు అన్నదమ్ముల సమరంతో వైసీపీ వర్సస్ టీడీపీ కూటమి పోటీ కాస్తా?. నాని వర్సెస్ చిన్ని అన్నట్లు మారిపోయింది.ఆంధ్ర రాజకీయాలకు కేరాఫ్‌గా చెప్పే విజయవాడలో పాలిటిక్స్ ఎప్పుడూ డిఫరెంట్‌గా ఉంటాయి. ఆ క్రమంలోనే ఇద్దరు అన్నదమ్ముల మధ్య సవాల్‌గా మారాయి. హేమాహేమీ నేతలు ఎందరో ప్రాతినిధ్యం వహించిన బెజవాడ పార్లమెంట్‌లో ఈసారి బ్రదర్స్ మధ్య పోటీ కాకరేపుతోంది. దీంతో రాజకీయ రాజధానిగా నిలిచిన విజయవాడలో లోక్‌సభ ఎన్నికలు ఆసక్తికరంగా మారిపోయాయి.అధికార వైసీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న సిట్టింగ్ ఎంపీ కేశినేని నాని.. కొద్ది రోజుల క్రితమే టీడీపీకి రాజీనామా చేసి వైసీపీ గూటికి చేరారు. పార్టీలో చేరిన 24 గంటల్లోనే ఆయనకు టికెట్ ఖరారు చేసింది అధికార పార్టీ? గత రెండు ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా గెలిచిన నాని ఈసారి వైసీపీ తరఫున పోటీ చేసి హ్యాట్రిక్ సాధించాలని తహతహలాడుతున్నారు. స్వతహాగా వ్యాపారవేత్త అయిన కేశినేని నాని? 2009లో ప్రజారాజ్యం పార్టీ నుంచి రాజకీయాల్లో ప్రవేశించారు. 2014లో టీడీపీ తరఫున ఎంపీగా పోటీ చేసి సంచలన విజయం సాధించారు. ఆ ఐదేళ్లు తన పనితీరుతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నాని? 2019లో ఫ్యాన్ హవాను తట్టుకుని రికార్డు లెవల్ లో విజయం సొంతం చేసుకున్నారు. పార్లమెంట్ పరిధిలో ఒక్క అసెంబ్లీ నియోజకవర్గంలో మాత్రమే టీడీపీ గెలిచినా, ఎంపీగా నాని గెలవడం వెనుక ఆయన వ్యక్తిగత ఇమేజ్ కూడా ఉందనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి.ఇలా వరుసగా రెండుసార్లు గెలిచిన నాని? ఈ మధ్యే పార్టీ మారారు. తన స్థానంలో కేశినేని చిన్నిని ప్రోత్సహిస్తున్నారని టీడీపీపై తిరుగుబాటు చేశారు ఎంపీ నాని. రెండోసారి గెలిచిన తర్వాత ఎంపీ నానికి? టీడీపీ స్థానిక నేతలకు పెద్ద గ్యాపే వచ్చింది. నియోజకవర్గ పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటూ వచ్చిన నాని? స్థానిక నేతలను అసలు లెక్క చేసేవారు కాదు. ఇలా ఈ గ్యాప్ పెరిగి పెద్దదై.. ఏకంగా తిరువూరు బహిరంగ సభకు రావొద్దంటూ సిట్టింగ్ ఎంపీకి కబురు పంపేంత వరకు వెళ్లింది. ఎంపీగా గెలిచిన తనను కాదని అధిష్టానం.. ఇతరుల మాటలు వింటుందని అసంతృప్తికి లోనైన నాని? టీడీపీతో తెగతెంపులు చేసుకున్నారు? ఆ వెంటనే సీఎం జగన్‌ను కలిసి వైసీపీలో చేరారు. ఎంపీ టికెట్ తెచ్చుకున్నారు.సీఎం జగన్ ఆశీస్సులతో మరోసారి పోటీ చేస్తున్న ఎంపీ నాని? హాట్రిక్‌పై నమ్మకం పెట్టుకున్నారు. కానీ, ఆయన విజయ పరంపరకు బ్రేక్ వేస్తానని టీడీపీ అభ్యర్థి కేశినేని చిన్ని ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఎంపీగా నాని రెండోసారి గెలిచిన తర్వాత నియోజకవర్గ పరిధిలో టీడీపీ నేతలతో తీవ్రంగా విభేదించడంతో అధిష్టానం చాలా కాలం ముందే చిన్నిని రంగంలోకి దింపింది. నానితో సమానంగా చిన్నికి పార్టీలో ప్రాధాన్యమిచ్చింది. అధిష్టానం అండదండలతో చిన్ని కూడా వ్యూహాత్మకంగా అడుగులు వేసి..తనకంటూ సొంత గ్రూపు తయారుచేసుకున్నారు. నేతలతో సమన్వయం చేసుకుంటూ అధిష్టానం అండదండలతో నియోజకవర్గ వ్యాప్తంగా పరిచయాలు పెంచుకున్నారు.మరోవైపు వైద్య శిబిరాలతోపాటు సేవా కార్యక్రమాలతో ప్రజల్లో గుర్తింపు తెచ్చుకున్నారు. యువనేత లోకేశ్ యువగళం పాదయాత్ర విజయవంతం చేయడంలో నూటికి నూరు శాతం సక్సెస్ అయ్యారు చిన్ని? పార్టీలో తిరుగులేని లీడర్‌గా ఎదిగారు. ఆ ధీమాతోనే టీడీపీ కోటను నిలబెడతానని తొడగొడుతున్నారు. విజయవాడను గెలిచి చంద్రబాబుకు కానుక ఇస్తానని చెబుతున్నారు చిన్ని?ఇలా ఈ ఇద్దరు అన్నదమ్ములు తగ్గేదేలే అన్నట్లు పోటీ పడుతుండటంతో?. బెజవాడలో రాజకీయ యుద్ధం ఆసక్తికరంగా మారింది. గత ఎన్నికల్లో పార్లమెంట్ పరిధిలోని ఆరు నియోజకవర్గాలు గెలుచుకున్న వైసీపీ?. ఈసారి లోక్‌సభ స్థానాన్ని తన ఖాతాలో వేసుకునేలా పావులు కదుపుతోంది. ఐతే, ఈసారి లోక్‌సభతోపాటు ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలను గెలుస్తామని ధీమా వ్యక్తం చేస్తోంది టీడీపీ? దీంతో రెండు పార్టీలకు విజయవాడ లోక్‌సభ స్థానం కత్తిమీద సాములా మారింది.వైసీపీ ఒకవైపు? టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి మరోవైపు తలపడుతున్న ఈ ఎన్నికల్లో కాంగ్రెస్, కమ్యూనిస్టులు కూడా పోటీ చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఒకప్పుడు కాంగ్రెస్‌తోపాటు కమ్యూనిస్టులు కూడా ఈ లోక్‌సభ పరిధిలో గణనీయంగా ప్రభావం చూపారు. ఇప్పుడు వారు చీల్చే ఓట్లు కూడా ప్రధాన పార్టీల తలరాతలను మార్చబోతున్నట్లు చెబుతున్నారు. దీంతో విజయం ఎవరిని వరిస్తుందోనన్న ఉత్కంఠే ఎక్కువగా కనిపిస్తోంది. ఏదిఏమైనా విజయవాడలో విజయతిలకం దిద్దడం అంత ఈజీ కాదంటున్నారు పరిశీలకులు. మరి ఓటర్లు ఎవరికి జైకొడతారో చూడాలి

# నాదెండ్లపై జనసైనికులు గరం.. గరం

గుంటూరు, మార్చి 27 జనసేన పార్టీ నేతల్లో ఆగ్రహం వ్యక్తమవుతుంది. తమకు బలమున్న చోట, బలమైన నేతలున్న చోట కాకుండా ఇతర స్థానాలను తీసుకోవడం పట్ల వారు గుర్రుగా ఉన్నారు. తొలుత 24 స్థానాలంటే ఒకింత అసహనానికి గురైన క్యాడర్, లీడర్లు.. ఆ తర్వాత 21కి తగ్గించుకున్న తర్వాత ఒకింత ఆందోళనకు గురయ్యారు. పట్టున్న ప్రాంతంలో కాకుండా జనసేనను బలహీనంగా ఉన్న చోట పోటీ చేయించి మరింత వీక్ చేసేందుకు చేసిన ప్రయత్నాల్లో మిత్రపక్షం సక్సెస్ అయిందన్నది నేతల వాదనగా వినిపిస్తుంది. బలమైన తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో ఎక్కువ స్థానాలను తీసుకోకపోవడంతో పాటు అసలు నేతలే లేని చోట తాము తగుదునమ్మా అంటూ బరిలోకి దిగడం ఎంతవరకూ సబబని ప్రశ్నిస్తున్నారు. ముఖ్యంగా పవన్ కల్యాణ్ ను సీట్ల



విషయంలోనూ, స్థానాల ఎంపికలోనూ, అభ్యర్థుల ఖారారులోనూ తప్పుదోవ పట్టించింది నాదెండ్ల మనోహర్ అని పలువురు నేతలు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. రైల్వే కోడూరు వంటి స్థానాల్లో పోటీ చేయడం అవసరమా? అని ప్రశ్నిస్తున్నారు. అక్కడ నేతలు కానీ, క్యాడర్ కాని ఎవరైనా ఉన్నారా? అని నిలదీస్తున్నారు. తెలుగుదేశం పార్టీకి ప్రయోజనం చేకూర్చడం కోసమే నాదెండ్ల మనోహర్ ఆ పార్టీ కోవర్టుగా వ్యవహరించి పవన్ ను పక్కదారి పట్టించేలా చేస్తున్నారని నేతలు ఆరోపిస్తున్నారు. నాదెండ్ల తొలి నుంచి పార్టీలో పవన్ ను కలవనివ్వకుండా అడ్డుకోవడమే కాకుండా తప్పుడు సలహాలు ఇస్తున్నారని, ఆ ప్రమాదాన్ని తాము ముందే ఊహించామని అంటున్నారు. పార్టీని పణంగా పెట్టి... నాదెండ్ల మనోహర్ కారణంగానే అనేక మంది నేతలు పార్టీని వీడిపోయిన విషయాన్ని కూడా వారు గుర్తు చేస్తున్నారు. నాదెండ్ల తొలి నుంచి పవన్ పక్కనే తిరుగుతూ తప్పుడు సమాచారం అందిస్తూ పార్టీ కోసం, పవన్ కోసం పనిచేస్తున్న నేతలను పక్కన పెడుతూ వస్తున్నారన్నారు. కేవలం తాను గెలవడం కోసం నాదెండ్ల పార్టీని పణంగా పెట్టారంటున్నారు. ఆయన అనుమతి లేనిదే పవన్ ను కలిసేందుకు కూడా వీలులేదని, సీట్ల సర్దుబాటు విషయంలోనూ నాదెండ్ల చంద్రబాబు పక్షాన చేరి పవన్ ను తన మాటలతో మార్చివేశారంటున్నారు. నాదెండ్లతో పాటు లింగమనేని కూడా పరోక్షంగా పవన్ కు సలహాలిస్తున్నందునే ఆయన ఈ నిర్ణయాలు తీసుకుంటున్నారని వాపోతున్నారు. ఉమ్మడి కృష్ణా జిల్లాలో ఒక్క స్థానాన్ని తీసుకోవడమేంటని వారు సూటిగానే ప్రశ్నిస్తున్నారు. పారా చూట్ నేతలకు... నాదెండ్ల మనోహర్ ఇతర పార్టీల నుంచి వచ్చిన నేతలకు టిక్కెట్లు ఇప్పించడంలో పవన్ ఒప్పించడంలో సక్సెస్ అయ్యారంటున్నారు. పారాచూట్ నేతలకు టిక్కెట్లు ఇవ్వడమేంటని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తిరుపతి సీటును అప్పుడే పార్టీలో చేరిన ఆరణి శ్రీనివాసులుకు ఎలా ఇస్తారంటూ అక్కడి జనసేన నేతలు గుర్రుమంటున్నారు. టిక్కెట్లు పొందిన వారిలో ఎక్కువ మంది ఇతర పార్టీల నుంచి వచ్చిన నేతలేనని, పార్టీలో కష్టపడిన వారికి నాదెండ్ల ప్రాధాన్యత లేకుండా చేశారంటున్నారు.

# అరకు అందాలకు ఫిదా



విశాఖపట్టణం మార్చి 27 తెలుగు రాష్ట్రాలు ప్రకృతి అందాలకు నెలవు. సహజసిద్ధమైన కొండలు, లోయలు, వాగులు వంకలు భారతీయులతోపాటు విదేశా యాత్రీకులను కూడా ఆకట్టుకుంటున్నాయి. తాజాగా అమెరికా రాయబారి ఎరిక్ గార్సెట్టి, ప్రతినిధులు ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పు కనుమల్లో పర్యటించారు. అరకు అందాలకు ఫిదా అయ్యారు. విశాఖలోని కైలాసగిరి, ఆర్కే బీచ్‌తోపాటు అరకు పరిసరాల్లో పచ్చదనం, ప్రకృతి ఒడిలో అక్కడి ప్రజల జీవన విధానం చూసి ముగ్ధులయ్యారు. విశాఖ?అరకు మార్గంలో ప్రకృతి అందాలు, పచ్చదనం, నీటి ప్రవాహాలను చూసి పరవశించారు. పర్యావరణానికి దగ్గరగా, ఆరోగ్యకరమైన జీవనానికి చేరువగా ఉన్నట్లు యూఎస్ కాన్సులేట్ ప్రతినిధులు పేర్కొన్నారు.విశాఖ తీరంలో మార్చి 18 నుంచి భారత్?అమెరికా సైనిక సంయుక్త విన్యాసాలు కొనసాగుతున్నాయి. రెండు దేశాలకు చెందిన త్రివిధ దళాలు ఇందులో పాల్గొంటున్నాయి. ఈ ప్రదర్శనలో భారత్ పూర్తి స్వదేశీ పరిజ్ఞానంలో రూపొందించిన ఐఎన్ఎస్ జలస్వ నౌకతోపాటు అమెరికాకు చెందిన యుద్ధ నౌకలపై త్రివిధ దళాలు విన్యాసాలు ప్రదర్శించారు.సైనిక విన్యాసాల్లో భాగంగా బాహుబలి నౌక కూడా విశాఖ తీరానికి చేరుకుంది. అమెరికా?భారత్ సౌనిక సిబ్బంది యూఎస్ కాన్సులేట్ ప్రతినిధులకు అవగాహన కల్పించారు. ఈ విన్యాసాల్లో ప్రపంచంలోనే అతిపెద్ద యుద్ధనౌకగా గుర్తింపు పొందిన సోమర్‌సెట్ 25 యుద్ధ ట్యాంకులు, నాలుగు హెలికాప్టర్లు అనివైపులా ఆయుధ ట్యాంకులు, 1000 మంది సిబ్బంది నౌకలో ఉండడం విశేషం. 2001, సెప్టెంబర్‌లో వరల్డ్ ట్రేడ్ సెంటర్‌పై ఉగ్రదాడల స్మారకంగా నిర్మించిన యుద్ధనౌకకు విపత్తుల సమయంలోనూ రక్షణ దళాలకు ఆస్పత్రిగా సేవలు అందిస్తుంది. టైగర్ ట్రయాంప్ పేరిట ఈనెల 31 వరకు సముద్రంపై విన్యాసాలు చేయనున్నాయి.

## యువత కోసం 20లక్షల ఉద్యోగాలు

మెదటిపేజీ తరువాయి...

ఐదేళ్లపాటు కరెంట్ ఛార్జీలు పెంచలేదు. పేదల కష్టాలు ఏమాత్రం తెలియని వ్యక్తి జగన్. రూ.60ల మద్యాన్ని రూ.200లకు అమ్ముతున్నారు. ఈ ఐదేళ్లలో మీ ఆదాయం పెరిగిందా.. తగ్గిందా? పేదలను నిరుపేదలుగా మార్చిన పెత్తందారు జగన్. పేదల జీవితాల్లో వెలుగులు చూపించే బాధ్యత నాది. మహిళలను వేధించిన వారు బాగుపడినట్టు ఎక్కడా లేదు. ఎలాంటి ఆంక్షలు లేకుండా ఆడబిడ్డ నిధి ఇస్తాం. మహిళలకు ఉచితంగా బస్సు ప్రయాణం కల్పిస్తాం. అన్నదాత కింద రైతుకు ఏటా రూ.20వేలు ఇస్తాం. బీసీలకు 50 ఏళ్లకే పింఛను ఇస్తాం. మేం వచ్చాక ఐదేళ్ల పాటు కరెంటు ఛార్జీలు పెరగవు. చేనేత కార్మికుల కోసం ప్రత్యేక పాలసీ తెస్తాం. నగరిలో ప్రతి ఎకరాకు నీరిచ్చే బాధ్యత నాది అని ప్రకటించారు. ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తుని మార్చే తేదీ మే 13. జగన్ అహంకారం కూలిపోయి, తాడేపల్లి ప్యాలెస్ ను బద్దలు కొట్టేది ఆ రోజే. సొంత తోబుట్టునే అవమానించిన రాక్షసుడు జగన్. మహిళను బాధపెట్టిన ఎవరూ బాగుపడలేదని వైఎస్ జగన్‌పై చంద్రబాబు ధ్వజమెత్తారు. పన్నుల భారం లేని పరిపాలన అందిస్తానని చంద్రబాబు హామీ ఇచ్చారు. జగన్ ప్రజల్ని గొర్రెలను కొన్నట్టుగా కొని ఇష్టానుసారం చేశారని, ముసుగు వీరుడు మొట్టమొదటిసారి తాడేపల్లి దాటి వస్తున్నాడని పంచ్‌లు వేశారు. విదేశీ విద్య పథకాన్ని రద్దు చేసిన పెత్తందారు జగన్మోహన్ రెడ్డి అని మండిపడ్డారు. టిడ్కో ఇళ్లను రద్దు చేసిన పెత్తందారుడు జగన్. దళితుడిని చంపి ఇంటికి పంపిన వారితో కులికే పెత్తందారుడు జగన్. అలాగే నగరి ప్రజాగళం ప్రచార కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు పాల్గొన్నారు. స్థానిక ఎమ్మెల్యే, మంత్రి ఆర్కే రోజాపై చంద్రబాబు తీవ్ర విమర్శలు చేశారు. జబర్దస్త్ ఎమ్మెల్యే రోజా నియోజకవర్గానికి ఏమీ చేయలేదని మండిపడ్డారు. మున్సిపాలిటీలో పదవి ఇస్తామని రూ.40 లక్షలు తీసుకున్నారని చంద్రబాబు ఆరోపించారు. నగరి నియోజకవర్గంలో అడుగడుగునా అరాచకం రాజ్యమేలుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇసుక దోపిడికి అడ్డూ అదుపు లేదన్నారు. చివరికీ మట్టిని కూడా వదలడం లేదని చంద్రబాబు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. నగరి తెలుగుదేశం పార్టీ అభ్యర్థి భాను ప్రకాష్ ప్రజలు మెచ్చిన నాయకుడని చంద్రబాబు ప్రశంసించారు. ప్రజలు కోరడంతో టికెట్ ఇచ్చానని వివరించారు. గాలి ముద్దుకృష్ణమ నాయుడుని తలపించేలా భాను ప్రకాష్ ప్రజా సేవ చేస్తారని వివరించారు. భానుని ఆ విధంగా తయారు చేస్తానని చంద్రబాబు జనాలకు వివరించారు. దివంగత గాలి ముద్దుకృష్ణమ నాయుడు కుమారుడు భాను ప్రకాశ్ అనే సంగతి తెలిసిందే. పవర్ రూములకి 400 యూనిట్ల కరెంట్ ఇస్తాం అని చెప్పి సీఎం జగన్ మాట తప్పారని చంద్రబాబు విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో తమ పార్టీ అధికారంలోకి వస్తే చేనేత కార్మికులకు 500 యూనిట్ల కరెంట్ ఉచితంగా ఇస్తామని చంద్రబాబు హామీనిచ్చారు. పవర్ లూమ్ కార్మికులకు 5 యూనిట్ల కరెంట్ ఫ్రీగా ఇస్తామని వివరించారు. నింద్ర షుగర్ ఫ్యాక్టరీ తిరిగి రైతులకు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. నగరిలో పారిశ్రామిక వాడను తీసుకొస్తామని ప్రకటించారు. టెక్స్ టైల్ పార్క్ కూడా ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. ఉద్యోగం కోసం ఇక్కడి నుంచి చెన్నై వెళ్లే పరిస్థితి ఇకపై ఉండదని చెప్పారు. నగరికి నీళ్లు తీసుకొచ్చే వేణుగోపాల సాగర్ హంద్రీనీవా ప్రాజెక్టు పూర్తి చేస్తామని తెలిపారు. నగరి పుత్తూరులో సమ్మర్ స్టోరేజ్ పూర్తి చేస్తామని చంద్రబాబు ప్రకటించారు.



## మోడల్ కాలేజ్ దరఖాస్తులకు ఆహ్వానం...

విభారే న్యూస్ డోన్ మా ప్రతినిధి :- మార్చి 27 డోన్ మండల పరిధిలోని ఉడుమలపాడు ఏపీ మోడల్ స్కూల్ మరియు జూనియర్ కాలేజ్ నందు ఇంటర్మీడియేట్ మొదటి సంవత్సరం లో ప్రవేశం కోరు



విద్యార్థులు ఆన్ లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవలయును అని ప్రిన్సిపల్ జాస్మిన్ ఒక ప్రకటనలో తెలియ చేశారు 28.3.2024 నుండి 22.5.2024 వరకు దరఖాస్తు చేసుకొగలరు.దరఖాస్తు రుసుము ఓబీసీలకు -200/. ఎస్సీ ఎస్టీ మరియు వికలాంగులకు-150/- www.cse.ap.gov.in www.apms.apcfss.in వెబ్ అడ్రస్ ద్వారా ఎంపీసీ,బైపీసీ , సీఈసీ మరియు ఎంఈసి గ్రూపులు కలవు. ఇంగ్లీష్ మీడియం విద్యార్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి దరఖాస్తు ఫారాలు, స్టడీ సర్టిఫికెట్, ఆధార్ లను కాలేజ్ నందు ఇవ్వవలయునని ఆమె తెలిపారు

## శ్రీశైల దేవస్థాన అన్న ప్రసాద వితరణ కు భక్తుల విరాళం..



శ్రీశైలం మార్చి 27 విభారె న్యూస్..శ్రీ భ్రమరాంబికా మల్లికార్జున స్వామి అమ్మవార్ల దేవాలయం లో ప్రతి నిత్యం భక్తులకు జరిగే అన్నప్రసాద వితరణ కు గాను ఎం.వెంకటేష్ మేడ్చల్ హైదరాబాద్ వారు రు.1,01,116 లను పర్యవేక్షకులు టి.హిమ బిందు కు,సి.హెచ్.నారాయణ స్వామి తిరుపతి వారు రు.1,01,116 లను సి.మధుసూదన్ రెడ్డి కి అందచేశారు.వీరికి దేవాలయం వారు స్వామి అమ్మవార్ల ప్రత్యేక దర్శనం చేయించి శాలువాతో సత్కరించి స్వామి అమ్మవార్ల లడ్డు ప్రసాదాన్ని,చిత్ర పటాన్ని అందచేశారు..

## శ్రీ నరసింహ ఈరన్న స్వామి దేవస్థాన హుండీ లెక్కింపు....



కౌతాళం మార్చి 27 విభారె న్యూస్.. శ్రీ నరసింహ ఈరన్న స్వామి దేవస్థాన హుండిని 27.03.2024 బుధవారం రోజు లెక్కించారు. అందులో భాగంగా రు.24,69,790/- రాగా,అన్నదానం కు గాను రు.5,48,384/- రాగా,బంగారు:05 గ్రా. 800 మి.గ్రా.,వెండి:4 కేజీల 100 గ్రా. వచ్చాయి.ఈ కార్యక్రమంలో దేవస్థానం డిప్యూటీ కమిషనర్, కార్యనిర్వహణాధికారి హెచ్.జి.వెంకటేష్, హుండీ పర్యవేక్షణ అధికారి పి.సి. రాంప్రసాద్, గ్రేడ్-ఎ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఆదోని,దేవస్థాన పర్యవేక్షకులు, ఇతర సిబ్బంది, శ్రీ భ్రమరాంబ సేవసమితి ఆదోని వారు పాల్గొనియున్నారు.

## ఘనంగా రాంచరణ్ 39వ జన్మదిన వేడుకలు

: ఎమ్మిగనూరు మార్చి 27 విభారె న్యూస్..తాలూకా అధ్యక్షుడు రాహుల్ సాగర్ ఎమ్మిగనూరు తాలూకా మెగా ఫ్యాన్స్ సేవా సమితి ఆధ్వర్యంలో స్థానిక రామస్వామి దేవాలయం నందు పూజా కార్యక్రమం నిర్వహించి దివ్యాంగులకు బట్ల పంపిణీ, కేక్ కటింగ్ చేసి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తాలూకా



అధ్యక్షులు రాహుల్ సాగర్ మాట్లాడుతూ తెలుగు సినిమా చరిత్రలో గ్లోబల్ స్టార్ గా పెరుగు పొందిన ఏకైక నటుడు రామ్ చరణ్ ని రామ్ చరణ్ సేవాగుణం ఎందరో యువకులకు ఆదర్శమని భవిష్యత్తులో రామ్ చరణ్ చేవట్టబోయే ప్రతి కార్యక్రమం విజయవంతం కావాలని అదేవిధంగా ప్రతి ఒక్క సినిమా దిగ్విజయం సాధించాలని మెగాస్టార్ చిరంజీవి లాగా ఎనలేని కీర్తి అభిమానం మన రామ్ చరణ్ సొంతం కావాలని మనస్ఫూర్తిగా దేవుని కోరుతున్నాను ఈ కార్యక్రమంలో రమేష్ రషీద్ ప్రకాష్ ఎర్రి స్వామి తదితరులు పాల్గొన్నారు..

# ఫ్యాన్ ప్రభంజనం ఖాయం..



ఎమ్మిగనూరు మార్చి 27 విభారె న్యూస్..27.03.2024 తేదీన 3 వ వార్డ్ లోని జమ్ములమ్మ దేవాలయంలో పూజలు నిర్వహించి ఇంటింటికి తిరుగుతూ వైసీపీ ఎమ్మిగనూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీమతి బుట్టా రేణుక ఎన్నికల ప్రచారం నిర్వహించారు.ఈ ప్రచారంలో 3వ వార్డు కౌన్సిలర్,స్వాతి,వార్డు ఇంచార్జ్ వినయ్,శ్రీమతి బుట్టా రేణుక మాట్లాడుతూ.. మే 13 న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా మరోసారి ఫ్యాన్ ప్రభంజనం ఖాయమని ఎమ్మిగనూరు నియోజకవర్గ అభ్యర్థి శ్రీమతి బుట్టా రేణుక దీమా వ్యక్తం చేశారు.ప్రజా సంకల్ప పాదయాత్రలో ప్రజల ఇబ్బందులను కళ్లారా చూసిన వైఎస్ జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక పేదల అభ్యున్నతి కోసం నవరత్నాల పథకాలు అమలుచేశారన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల వల్ల పేదల జీవన ప్రమాణాలు మెరుపడ్డాయన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం అందిస్తున్న పథకాలు కొనసాగాలంటే మరోసారి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఆశీర్వదించాలని కోరారు.ప్రజా సంక్షేమం, అభివృద్ధి కోసం మ్యానిఫెస్టోలో పేర్కొన్న హామీలతో పాటు చెప్పని వాటిని కూడా అమలు చేశామన్నారు. కరోనా మహమ్మరి ప్రభావంతో రాష్ట్ర ఆర్థిక పరిస్థి తులు బాగాలేకున్నా పేదల బాగుకోసం సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్మో హన్ రెడ్డికి దక్కుతుందన్నారు.ఫ్యాన్ గుర్తు కు ఓటు వేసి గెలిపించాలని కోరారు.3వ వార్డు నాయకులు, పంపయ్య,హుసేని,శీను,బందే, రహిమాన్, రాష్ట్ర శావ్ నెట్ కార్పొరేషన్ చైర్మన్ మాచాని వెంకటేష్, పట్టణ అధ్యక్షులు బుట్టా రంగయ్య,అధికార ప్రతినిధి సునీల్ కుమార్,పట్టణ ప్రధాన కార్యదర్శి వీరేంద్ర,జిల్లా వక్ఫ్ బోర్డు ఉపాధ్యక్షులు రియాజ్ అహ్మద్, మున్సిపల్ కోఆప్షన్ మెంబెర్ అబ్రార్,కౌన్సిలర్లు, అంపమ్మ, రాజరత్నం, అమాన్,శివప్రసాద్, నీలకంఠ,సుధాకర్,వహిద్, ఇన్చార్జు చంద్రశేఖర్,రుద్రాక్షల బజారి,ప్రతాప్ రెడ్డి,కోటకొండ నరసింహులు,గట్టు ఖాజా,టౌన్ బ్యాంక్ డైరెక్టర్లు సయ్యద్ చాంద్ బాషా, రజాక్, నాయకులు ఖిబులా హుసేన్,మాచని రఘు,డీలర్,మధు,ఇలాయఖత్,సలీం,గౌస్,జి.యమ్.భాషా,గోకరి, ఉబేదుల్లా,రామలింగారెడ్డి, బుట్టా యూత్ నాయకులు ఫయాజ్, ఉబేద్, కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు.

## సభలు, సమావేశాలకు ముందస్తు అనుమతులు తప్పనిసరి

### ---జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డా.కె.శ్రీనివాసులు

- విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి మార్చి 27-ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లో నున్న నేపథ్యంలో రాజకీయ పార్టీలు, వారి ప్రతినిధులు నిర్వహించే సభలు, సమావేశాలు, ర్యాలీలు, ఊరేగింపులు, ఇంటింటి ప్రచారం, కరపత్రాల పంపిణీ తదితర ప్రచార కార్యక్రమాలకు ముందస్తు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డా.కె.శ్రీనివాసులు పేర్కొన్నారు.బుధవారం కలెక్టర్ ఛాంబర్ లో ఎన్నికల ప్రవర్తన నియమావళి, ఓట్ల లెక్కింపు కేంద్రాల నిర్ణయంపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్



టి.రాహుల్ కుమార్ రెడ్డి, డిఆర్ఓ ఎ. పద్మజ, కాంగ్రెస్ పార్టీ తరఫున సయ్యద్ రియాజ్ భాష, తెలుగుదేశం పార్టీ ప్రతినిదులు శివరామ్ రెడ్డి, ప్రసాద్ రెడ్డి, బిజెపి పార్టీ తరపున చంద్రశేఖర్, వైయస్సార్సీపి తరపున అనిల్ అమృత రాజు, సాయిరాం రెడ్డి, సిపిఐ(ఎం) పార్టీ తరఫున పూల నరసింహులు, ఆమ్ ఆద్మీ పార్టీ తరఫున వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు. ఎన్నికల ఓట్ల లెక్కింపు కేంద్రాలకు సంబంధిచి ఎస్వీఆర్ ఇంజనీరింగ్ కాలేజీ, ఆర్జీఎం ఇంజనీరింగ్ కాలేజీలను గుర్తించామని రాజకీయ పార్టీల అభిప్రాయాలు సేకరించి ఆమోదం కొరకు ఎన్నికల కమిషన్ కు ప్రతిపాదనలు సమర్పిస్తామని రాజకీయ పార్టీల ప్రతినిధులకు వివరించారు.జిల్లా వ్యాప్తంగా మోడల్ కోడ్ ఉల్లంఘన చర్యలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామన్నారు. ఇప్పటివరకు 40 మంది రెగ్యులర్ అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేశామన్నారు. రాజకీయ ప్రచారంలో పాల్గొన్న 12 మంది వాలంటీర్లను తొలగించామన్నారు. సి విజిల్ ద్వారా 81 ఫిర్యాదులు అందగా 22 వాస్తమని తేల్చి తదుపరి చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ తెలిపారు. అభ్యర్థుల ప్రచారానికి సంబంధించి సువిధ సర్వీసు ద్వారా152 దరఖాస్తులు వచ్చాయని అందులో 132 దరఖాస్తులకు అనుమతులు మంజూరు చేయడం జరిగిందన్నారు. దరఖాస్తు చేసుకున్న 24 గంటల్లోనే అనుమతులు మంజూరు చేయడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. ఓటర్ల జాబితాకు సంబంధించి వచ్చే నెల 16వ తేదీ వరకు కూడా ఫార్మ్-6 అభ్యర్థనలు స్వీకరించడం జరుగుతుందన్నారు. ఫార్మ్-8 ద్వారా షిఫ్టింగ్ కు ఏప్రిల్ 15 వరకు అభ్యర్థనలు స్వీకరిస్తామన్నారు.


## ఘనంగా హీరో రామ్ చరణ్ జన్మదిన వేడుకలు

---విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి మార్చి 27-బుధవారం నాడు గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ జన్మదినం సందర్భంగా నంద్యాల జనసేన పార్టీ కార్యాలయం లో నంద్యాల రాంచరణ్ యువ శక్తి జిల్లా అధ్యక్షులు పబ్బతి రవికుమార్ జనసేన పార్టీ నంద్యాల నియోజకవర్గ సమన్వయకర్త వై విశ్వనాథ్ జనసేన నాయకులు పిడతల సుధాకర్ నంద్యాల రామ్ చరణ్ అభిమానులు మరియు జనసైనికుల ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా నంద్యాల అసెంబ్లీ ఉమ్మడి అభ్యర్థి ఎన్ఎండి ఫరూక్ , నంద్యాల పార్లమెంట్ అభ్యర్థి బైరెడ్డి శబరి , నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్. తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జనసైనికులు మెగా అభిమానులు అందరు ఒకతాటిపై వచ్చి ఉమ్మడి అభ్యర్థులను అఖండ మెజారిటీ తో గెలిపించాలని కోరారు . అంతేకాకుండా రామ్ చరణ్ ఇలాంటి పుట్టినరోజు వేడుకలు మరెన్నో జరుపుకోవాలని మెగా అభిమానులకు శుభాకాంక్షలు తెలియజేశారు . అలాగే బ్లడ్ డొనేట్ చేయడం వల్ల మరో ఇద్దరికీ సహాయపడడం జరుగుతుందని ప్రతి ఒక్కరూ బ్లడ్ డొనేట్ చేయాలని అందులో ఎటువంటి అపోహలు పెట్టుకోరాదని తెలియజేశారు . ఈ కార్యక్రమం లో సాయి జయంత్, సందీప్, సురేష్, నగేష్, అమర్, రాజశేఖర్, శ్రీనివాసులు జనసైనికులు మెగా అభిమానులు భారీసంఖ్య లో పాల్గొని రక్తదానం చేశారు . ఈ సందర్భంగా ముఖ్య అతిధులు అందరు కార్యక్రమ నిర్వాహకులను అభినందించి రక్త దాతలకు ప్రశంసా పత్రాలు అందచేశారు .




## శ్రీ సూర్య దేవాలయం లో 28.03.2024 న సంకష్ట హర చతుర్థి వ్రతం..

కర్నూలు జిల్లా ప్రతినిధి మార్చి 27 విభారె న్యూస్..సంకష్టహర చతుర్థి వ్రతం.28-03-2024 గురువారం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వారికి



సంకష్టహర చతుర్థి వ్రతం జరుగును.గురువారం సంకటహర చతుర్థి కలిసి రావటం ద్వారా గురుబలం, సంతానం కొరకు స్వామి వారిని పూజిస్తే చాలా మంచిది ఈ రోజున స్వామి వారిని పూజించడం ద్వారా సకల అభీష్టాలు కలుగుతాయిస్వామివారికి ఉదయం పంచామృతాభిషేకము ,10 గంటలకు సంతాన గణపతి హోమం సాయంకాలము చంద్రోదయం న సంకష్టహర చతుర్థి వ్రతము జరుగునుఅభిషేకం 200 /-సంతాన గణపతి హోమం 3500 /-సంకటహర చతుర్థి వ్రతం 200 /-హోమ సంకల్పం 116 /- సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లుప్రహ్లాద శర్మ 8985806794దేవాలయం ఫోన్ పే గూగుల్ పే నెంబరు:8896123777.

## సమర శంఖారావం పూరించిన వైఎస్ఆర్సిపి ఎమ్మెల్యే అభ్యర్థి శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి మార్చి 27-నంద్యాల నియోజకవర్గం లో బుధవారం వైఎస్ఆర్సిపి ఎమ్మెల్యే అభ్యర్థి శిల్ప రవిచంద్ర కిషోర్ రెడ్డి నంద్యాల పట్టణం 6వ వార్డు నుండి ఎన్నికల సమర శంఖారావాన్ని పూరించారు. ముందుగా తండ్రి మాజీ మంత్రి శిల్పమోహన్ రెడ్డి, చిన్నాన్న శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి ల ఆశీస్సులను తీసుకొని, ప్రత్యేక పూజలు నిర్వహించి సమర శంఖారావాన్ని పూరించారు. ప్రచారంలో భాగంగా వైఎస్ఆర్సిపి ప్రభుత్వం చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను చూసి రాను ఎన్నికల్లో మరోసారి ఆశీర్వదించాలని వైఎస్ఆర్సిపి ఎమ్మెల్యే అభ్యర్థి శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో నంద్యాల మున్సిపల్ చైర్ పర్సన్ మాబన్నీ సా, రాష్ట్ర మార్క్ఫెడ్ చైర్మన్ పి.పి నాగిరెడ్డి, వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ మహేశ్వర్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్లు గంగిశెట్టి శ్రీధర్, పాం షావలి, ఆరో వార్డు కౌన్సిలర్ పురందర్ కుమార్ హాజరయ్యారు.

## వైన్ షాపు కు నోటీసులు



----విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి మార్చి 27- పట్టణంలో పద్మావతి నగర్ లో జ్యోతి వైన్ షాపు వారికి శానిటేషన్ సూపరైజర్ లక్ష్మినారాయణ తో నోటీసులు పంపామని మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మున్సిపల్ కార్యాలయం లో కమిషనర్ మాట్లాడుతూ పద్మావతి నగర్ ప్రధాన రహదారిలో గల జ్యోతి వైన్స్ యాజమాన్యం వారు బ్రాందీ షాపు నుండి ఉత్పత్తి అయ్యే ప్లాస్టిక్ గ్లాసులు, నీటి కవర్లు (వాటర్ ప్యాకెట్స్), తినుబండరాలకు సంబంధించిన వ్యర్థాలు ఏటువంటి చెత్త కుండీలను ఏర్పాటు చేసుకోకుండా మురుగు కాలువలో, రోడ్లపై విచ్చలవిడిగా వేయడం వల్ల మురుగు నీటి ప్రవాహానికి అంతరాయం ఏర్పడింది. అలాగే ప్రజారోగ్యానికి కూడా హానికలుగుతుంది . ఘనవ్యర్థ పదార్థాల నివారణ చట్టం 2016 మరియు ప్లాస్టిక్ నియంత్రణ చట్టాలను ఉల్లంఘించినందున దీనిపై జరిమాణ విధించి పురపాలక సంఘం ప్రజారోగ్య చట్టం మేరకు చర్యలు తీసుకొంటామని ఆయన అన్నారు. మరియు వ్యర్థాలను సేకరించుటకు అనుగుణంగా చెత్త కుండీలను ఏర్పాటు చేసుకొని పురపాలక సంఘ వాహనానికి తడి చెత్త, పొడి చెత్త వ్యర్థాలను అందజేయవలసినదిగా పట్టణ ప్రజలకు సూచించారు .

## నేడు స్వాతి నక్షత్రం స్వామి వారికి ప్రత్యేక పూజలు

---విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి మార్చి 27-తెలుగు పేటలో వెలసిన శ్రీ మద్దులేటి లక్ష్మి నృసింహా స్వామి దేవస్థానం యందు గురువారం స్వాతి నక్షత్రం పర్వదినాన స్వామి వారి అభిషేక కార్యక్రమం ఉంటుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. "శ్రీ నృసింహ స్వామి వారి జన్మ నక్షత్రం స్వాతి నక్షత్రం'' పురస్కరించుకుని ఆలయం లో



అర్చకులు ఉదయం 6:30గం లకు మూలమూర్తి "శ్రీ మద్దులేటి లక్ష్మీ నృసింహా స్వామి" వారి పంచామృత అభిషేకం మరియు స్నవన తిరుమంజనం కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు . కావున భక్తులు ఆలయం లో నిర్వహించు స్వామి వారి అభిషేకం కార్యక్రమం తిలకించి, మహా మంగళహారతి స్వీకరించి తదుపరి స్వామి వారి నైవేద్యం స్వీకరించి, స్వామి వారి కృపకు పాత్రులు కాగలరు అని కోరారు.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190